

మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్



గ్రామంలో వేసిన అంతర్గత సీసీ రోడ్డు




గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం



24 గంటల ఉచిత కరెంటు అందించేందుకు పొలాల్లో ఏర్పాటు చేసిన డీఆర్టీ

# ప్రగతి పథంలో 'లంబాడీహెట్టి'

- తండా నుంచి జీపీగా ఆవిర్భావం
- నిధుల మంజూరుతో మరింత అభివృద్ధి
- అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు
- గ్రామం నుంచి గుప్పగూడెం వరకు రూ 24 లక్షలతో బీటీ రోడ్డు
- తండావాసుల హర్షం

చింతలమానేపల్లి, సెప్టెంబర్ 30 : స్వరాష్ట్రంలో మండలంలోని లంబాడీహెట్టికి గ్రామానికి మహర్దశ పట్టింది. ఒకప్పుడు తండాగా ఉండగా, సీఎం కేసీఆర్ 500 జనాభా గల గూడేలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయగా, అందులో భాగంగా లంబాడీహెట్టి గ్రామం కూడా పంచాయతీగా ఏర్పడి ప్రగతి పథంలో పయనిస్తున్నది. ఇంతకుముందు పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. 2014 తర్వాత మార్పులు మొదలయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం తండాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నది. ఒకప్పుడు బాబాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది లంబాడీహెట్టి. తెలంగాణ ప్రభుత్వం లంబాడీహెట్టి, గుప్పగూడెం తండాలను కలిపి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి దశ మారింది. అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు నిర్మించారు. పల్లె ప్రగతిలో భాగంగా గ్రామంలో పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక, క్రీడా ప్రాంగాణం, డంప్ యార్డు, నర్సరీ, మిషన్ భగీరథ ట్యాంకులు ఏర్పాటు చేశారు. గ్రామంలో చెత్తాచెదారాన్ని తొలగించేందుకు పంచాయతీ సిబ్బందిని చెత్తను తరలించేందుకు ట్రాక్టర్‌ను అందుబాటులో ఉంచారు. వందశాతం మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో ఎమ్మెల్యే కోనప్ప చొరవతో తమ ఇబ్బందులు తప్పాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



లంబాడీ హెట్టి గ్రామం



### గ్రామ రూపురేఖలే మారిపోయాయి..

సీఎం కేసీఆర్ ఆలోచన విధానంతో మా గ్రామ రూపురేఖలే మారిపోయాయి. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కృషితో మా తండాను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. పల్లె ప్రగతిలో భాగంగా పంచాయతీ నిధులు మంజూరు చేయడం తో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పుడు గ్రామస్తుల ఇబ్బందులు తప్పినయ్. గత ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి చేసిందేమీ లేదు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న సీఎం కేసీఆర్ సార్‌కు రుణపడి ఉంటాం.

-జాటోత్ ధన్‌రాజ్, ఎంపీటీసీ, లంబాడీహెట్టి



### గ్రామస్తుల సహకారంతోనే..

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రధానంగా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉన్నతాధికారుల సలహాల మేరకు ముందుకు సాగుతున్నాం. అభివృద్ధి విషయంలో గ్రామస్తుల సహకారం కూడా బాగున్నది. అ లాగే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నాం. ఉన్నతాధికారులు సూచనలు, సలహాలు, సర్పంచ్ పాలకవర్గం , గ్రామస్తుల సహకారంతో మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నం.

- రాచకొండ రాజు, పంచాయతీ కార్యదర్శి, లంబాడీహెట్టి



### స్వరాష్ట్రంలోనే అభివృద్ధి..

స్వరాష్ట్రంలోనే మా తండా అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నది. సీఎం కేసీఆర్ సారు మా గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయడంతో గ్రామం దశ మారింది. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. గత ప్రభుత్వంలో పాలకులు పట్టించుకోకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. కానీ ఇప్పుడు మా గ్రామానికి ప్రధాన రహదారి తారుతో పాటు అంతర్గత సీసీ రోడ్లు నిర్మించారు. అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఇప్పుడు మా గ్రామం అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది.

-అజ్మీరా సాయి చరణ్, లంబాడీహెట్టి

## పారిశుధ్య పనులు చేపట్టాలి

దహెగాం, సెప్టెంబర్ 30 : గ్రామాల్లో తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. మండలంలోని లగ్గాం, చౌక, ఒడ్డుగూడ పంచాయతీల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంతో పాటు తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. వ్యాధులు ప్రబలితే వైద్యశిబిరాలను ఏర్పాటు చేయించాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. అదేవిధంగా గ్రామపంచాయతీల రికార్డులు పరిశీలించి ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట సర్పంచ్‌లు, కార్యదర్శులు ఉన్నారు.

## పరామర్శ

బెజ్జూర్, సెప్టెంబర్ 29 : మండలంలోని ఇప్పలగూడకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కనక్క దేవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. అధైర్య పడవద్దని పార్టీ పరంగా ఆదుకుంటామని హామీనిచ్చారు. అనంతరం దేవయ్య కుటుంబ సభ్యులకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు.



దేవయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

# ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



బెజ్జూర్: మండల కేంద్రంలో ర్యాలీ తీస్తున్న ముస్లింలు

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 30 : మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పట్టణంలోని ముస్లింలు మసీదుల్లో నమాజ్ చేసిన అనంతరం జామా మసీదు వద్ద చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేసి ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీగా వస్తున్న ముస్లింలకు ఎమ్మెల్యే కోనప్ప, జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు ఆధ్వర్యంలో లస్సీ, మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లను కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పంపిణీ చేశారు.

### బెజ్జూర్ మండలకేంద్రంలో..

బెజ్జూర్, సెప్టెంబర్ 30 : మండలకేంద్రంలోని ముస్లింలు గోల్కొండ మసీదు నుంచి తాహేర్ బాబా దర్గా వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

### సిర్పూర్(టీ) మండలకేంద్రంలో..

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 30 : మండలకేంద్రంతో పాటు లోణవెల్లి, వేంపల్లి గ్రామాల్లో మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిర్పూర్(టీ) సామాజిక దవాఖానలో నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వైద్యుడు జోగేందర్, ముస్లిం నాయకులు ఇఫ్బత్, ముఫ్తీ రఫీక్, ఆరీఫ్, మొయిస్, అక్మల్ ఖాన్ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ మున్సిపాలిటీ : ముస్లింలకు లస్సీ పంపిణీ చేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు

## విద్యార్థులకు పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 30 : పట్టణంలోని నవోదయ విద్యాలయం, సర్‌సిల్క్ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు పారిశుధ్యంపై వ్యాసరచన, చెత్తతో ఉపయోగంపై చిత్రలేఖన పోటీలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ప్రనీల్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు శంకర్, శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## గుడ్డెలుగు దాడిలో తీవ్రగాయాలు

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 30 : మండలంలోని భూపాలపట్నం గ్రామంలో శనివారం గుడ్డెలుగు దాడిలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిలి కత్తరసాల కాపరి శనివారం బర్రెలను మేపేందుకు అడవికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో వెనుక నుంచి వచ్చిన గుడ్డెలుగు దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన తోటి కాపరులు కత్తరసాలను ఇంటికి తీసుకువచ్చారు.